ప్రజాశక్తి

సోమవారం 19 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





కార్యకర్తలు కష్టాల్లో ఉంటే..

చంద్రబాబు పట్టించుకున్నారా.?

- మోడీ కాళ్లు పట్టుకొనేందుకు పాకులాడుతున్నాడు..
- మరోసారి నా జోలికొస్తే బాగుండదు..
- టిడిపి అధినేతకు ఎమ్మెల్యే బలరాం హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరాం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బయటకు పోయామని చంద్రబాబు మాట్లాడుతున్నాడని, కార్యకర్తలు ఎవరైనా కష్టాల్లో ఉంటే చంద్రబాబు పట్టించుకున్నాడా...? అని చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం ప్రశ్నించారు. రాజకీయాల్లో ఎవరు దుర్మార్గులో చర్చించేందుకు తాను సిద్ధమని, నువ్వు సిద్ధమా...! అని అడిగారు. ఎక్కడ చర్చకు రమ్మన్నా తాను వస్తానని, నువ్వు వస్తావా...? చంద్రబాబుకు సవాల్ విసిరారు. శనివారం ఇంకొల్లులో చంద్రబాబు నిర్వహించిన 'రా కదలిరా..' సభలో కరణం బలరాం కృష్ణమూర్తిపై చంద్రబాబునాయుడు పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో బలరాం స్పందించారు. ఆదివారం ఒంగోలులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో చీరాలలో తనను గెలిపిస్తే తాను పార్టీ మారి వెళ్లి పోయానని, తాను దుర్మార్గుడినని చంద్రబాబు మాట్లాడుతున్నాడని, రాజకీయాల్లో చంద్రబాబుకంటే దుర్మార్గుడిని, నీచుడిని తాను చూడలేదని వ్యాఖ్యానించారు. 2019లో చీరాల టిక్కెట్ తాను అడగలేదన్నారు. చంద్రబాబు నాయుడిని, ఆయన కొడుకును చీరాలలో తిట్టిన వారిని ఓడించాలని తనను చీరాల పంపించడం జరిగిందన్నారు. ప్రజల ▶ 2లో

ధర పెరిగే..అమ్మకాలు తగ్గే..

- చికెన్ విక్రయాలపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్
- మటన్, చేపల పట్ల మాంసాహారుల ఆసక్తి
- జనాలు లేక చికెన్ షాపులు వెలవెల
- లబోదిబోమంటున్న వ్యాపారులు



శింగరాయకొండలో చికెన్ షాపు వద్ద లేని జనం, పక్కనే మటన్ షాప్ వద్ద ఉన్న కొనుగోలుదారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ ప్రకాశం జిల్లాలో చికెన్ విక్రయాలపై పడింది. జిల్లాలో చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. పక్క జిల్లా నెల్లూరు నుంచి కోళ్లు కొనవద్దని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల హెచ్చరికలతో పాటు చికెన్ ధర కూడా పెరగడంతో మాంసాహార ప్రియులు మటల్, చేపల కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. దీంతో చికెన్ షాపులు వెలవెలబోయాయి. బర్డ్‌ఫ్లూ ప్రచారంతో చికెన్ అమ్మకాలు పడిపోయాయని వ్యాపారులు వాపోతున్నారు.

నెల్లూరు జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ రావడంతో అక్కడి నుంచి కోళ్ల కొనుగోలు చేయొద్దని పశు సంవర్ధక శాఖ అధికారులు వ్యాపారులకు హెచ్చరికలు చేశారు. దీనికి తోడు కోళ్ల ద్వారా బర్డ్‌ఫ్లూ వస్తుందని ప్రచారం కావడంతో ఆదివారం చికెన్ అమ్మకాలు పడిపోయాయి. దీంతో మాంసాహార ప్రియుల మటన్, చేపలు కొనేందుకు ఆసక్తి చూపారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో కొన్ని షాపులలో జనాలు యధావిధిగా చికెన్ కొనుగోలు చేయగా, మరికొన్ని షాపులు జనాలు లేక వెలవెలబోయాయి. గత వారం స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ.220లు ఉండగా, ప్రస్తుతం కిలో ధర రూ.260కు చేరుకుంది. కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకటంతో చికెన్ తినేందుకు ప్రజలు ఆసక్తిని ప్రదర్శించలేదు. మటన్ కిలో ధర రూ.800 కాగా, చేపలు రకాలను బట్టి కిలో 150-300ల వరకు ధర పలికింది. అయినప్పటికి మటన్, చేపలు కొనేందుకు జనం ఎగబడ్డారు, దీంతో ఆయా షాపుల వద్ద రద్దీ పెరిగింది.

పడిపోయిన చికెన్ అమ్మకాలు

బర్డ్ ఫ్లూ ప్రభావంతో పలు ▶ 2లో



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బాలినేని, మాగుంట, శిద్దా

రోశయ్య విగ్రహావిష్కరణ

ఒంగోలులోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోశయ్య రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు.

- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్

ఎమ్మెల్యే గొట్టిపాటి కారు బోల్తా..

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ కారు బోల్తా పడింది. ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన సూర్యాపేట వద్ద ఆదివారం జరిగింది. ఆదివారం సాయంత్రం గొట్టిపాటి రవికుమార్ పార్టీ కార్యక్రమాలు ముగించుకొని విజయవాడ నుండి హైదరాబాదు వెళుతున్నారు. సూర్యాపేట వద్ద కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. వెంటనే కారులోని సేఫ్టీ ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో రవికుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో దగ్గరలో ఉన్న వైద్యశాలకు తరలించి.. ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మరో వాహనంలో రవికుమార్ హైదరాబాద్‌కు క్షేమంగా చేరుకున్నారు.

పార్టీలో ఉండి ద్రోహం చేయకండి..

- యాత్ర-2 సినిమా చూస్తుంటే..కన్నీళ్లొచ్చాయి..
- అంబేద్కర్ విగ్రహాల్లా వైఎస్ఆర్ విగ్రహాలు పెట్టారు
- అన్ని గ్రూపులు కలిసి పనిచేసి.. వైసిపి జెండా ఎగరేయండి
- మాజీ మంత్రి బాలినేని



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-శింగరాయకొండ

పార్టీలో ఉండి పార్టీకి ద్రోహం చేయొద్దని, కొండపి నుంచి ఆదిమూలపు సురేష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి జగన్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శింగరాయకొండలోని బాలాజీనగర్ వద్ద జాతీయ రహదారిపై వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ ద్వారం, రెండు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డితో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి చేతులమీదుగా జరగాల్సి ఉండగా.. సమయం లేక ఇలా జరిగిందని వివరించారు. యాత్ర-2 సినిమా చూసి కన్నీళ్లు పెట్టుకున్నానని చెప్పారు. వైఎస్ఆర్ విగ్రహాలు గ్రామాల్లో అంబేద్కర్‌కు పెట్టినట్లు పెడుతున్నారని, ఒక దళిత కాలనీలో చందాలు వేసుకొని మరీ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలు పెట్టినందుకు ఆనందంగా ఉందన్నారు. కొండపి నియోజకవర్గంలో పుట్టిన తన వద్దకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వస్తారని, అందరికీ పని చేయటం తనకు అలవాటని ఈ సందర్భంగా వివరించారు. ఇక్కడ వైసిపి రెండుసార్లు ఓడిపోవడానికి కారణం కేవలం గ్రూపులేనని, ఆ గ్రూపులను పక్కనపెట్టి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి అందరినీ కలుపుకొని పోయి పనిచేయాలని సూచించారు. అందరికీ అర్థమయ్యిందని ఎంపీ అభ్యర్థి ఎవరో తెలుసని, పేరు చెప్పకుండా అందరికీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురించి ▶ 2లో



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వాసంశెట్టి వెంకట్రావు

'జోడాకులు'కు ఓటేసి..గెలిపించండి..

- ఐటిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వాసంశెట్టి వెంకట్రావు.
- ఫెడరేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-చీరాల

ఐటిసి గుర్తింపు ఎన్నికలలో కార్మికులందరూ జోడాకులు గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలని ఐటిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వాసంశెట్టి వెంకట్రావు అన్నారు. ఐటీసీ గుర్తింపు ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం కారంచేడు గేటు నుండి ఫెడరేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని ఐటిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వాసంశెట్టి వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు. ఐటిసి కార్మికుల సంక్షేమ లక్ష్యంగా ఫెడరేషన్ అహర్నిశలూ పనిచేస్తూ వారి హక్కులు వారికి అందేలా కృషి చేస్తుందన్నారు. ఈ ర్యాలీ ఈపురుపాలెం, ▶ 2లో

ధర పెరిగే..అమ్మకాలు తగ్గే..

(మొదటిపేజీ తరువాయి)

మండలాలలో చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. కొన్ని మండలాలలో పూర్తి స్థాయిలో, మరికొన్ని మండలాలలో పాక్షికంగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. ప్రజలు మటన్, చేపలు కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపారు. శింగరాయకొండలో బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ కనిపించింది. జనాలు లేక చికెన్ షాపులు వెలవెలబోయాయి. జనాలు మటన్, చేపలు షాపుల వద్ద బారులు తీరారు. యర్రగొండపాలెం మండలంలో బర్డ్ ఫ్లూ ప్రభావం నామమాత్రంగానే కనిపించింది. ప్రజలు చికెన్ కొనటం మానుకొని పొట్టేలు మాంసం కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపారు. హనుమంతునిపాడు మండలంలో చికెన్ అమ్మకాలు బాగానే జరిగాయి. గత వారం కంటే ధర పెరిగినా ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు షాపుల వద్ద బారులు తీరారు. అర్ధవీడు మండలంలో బర్డ్ ఫ్లూ ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. ప్రజలు చికెన్ కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపారు. కనిగిరిలో బర్డ్ ఫ్లూ ప్రభావం కనిపించలేదు. చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు షాపుల వద్దకు వచ్చారు. గత వారం కంటే ధర పెరిగినా ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేయటం గమనార్హం. సిఎస్‌పురం మండలంలో, కొండపి మండలంలో బర్డ్ ఫ్లూ ప్రభావం అంతగా కనిపించలేదు. చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు షాపుల వద్దకు వచ్చారు. దీంతో పాటు మటన్, చేపలు అమ్మకాలు బాగానే సాగాయి. కొమరోలు, పుల్లలచెరువు మండలాలలో బర్డ్ ఫ్లూ ప్రభావం నామమాత్రంగానే ఉంది. చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపారు. గిద్దలూరు మండలంలో బర్డ్ ఫ్లూ ప్రభావం కనిపించలేదు. చికెన్‌తో పాటు మటన్, చేపలు కొనుగోలు చేశారు. పెద్దారవీడు మండలంలో బర్డ్ ఫ్లూ ప్రభావం కనిపించలేదు. చికెన్‌ను కొనుగోలు చేసేందుకు ప్రజలు షాపుల వద్ద బారులు తీరారు.

చికెన్ అమ్మకాలు పడిపోయాయి

రవి, హోల్‌సేల్ చికెన్ వ్యాపారి, ఒంగోలు

బర్డ్ ఫ్లూ ప్రభావంతో జిల్లాలో చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. చికెన్ షాపుల వైపు ప్రజలు పెద్దగా రాలేదు. నెల్లూరు జిల్లాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకటంతో ఆ జిల్లా కోళ్లను కొనవద్దని పశు సంవర్ధక శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరు జిల్లా మార్కెట్ అంతా తిరుపతి, చెన్నైలలో సాగుతోంది. జిల్లాకు సంబంధించి అద్దంకి, మార్టూరు, నరసారావుపేటల నుంచి కోళ్లు వస్తాయి. నెల్లూరు జిల్లాకు చెందిన కోళ్లు ప్రకాశం జిల్లాకు రావు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతోచికెన్ అమ్మకాలు పడిపోయాయి.

'జోడాకులు'కు ఓటేసి..గెలిపించండి..

(మొదటిపేజీ తరువాయి)

బోయినవారిపాలెం, బుర్లవారిపాలెం, గవినివారిపాలెం, కావూరివారిపాలెంలో జరిగింది. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు బసుందర్, సిహెచ్.గంగయ్య, చీరాల నాయకులు ఎన్.బాబురావు, ఎం.వసంతరావు, పి.కొండయ్య, ఫెడరేషన్ నాయకులు బోయిన పోతురాజు, గంట సుధీర్, నక్కల సాంబశివరావు, సిహెచ్ శివరాజు, గోసాల సుధాకర్, లక్ష్మీనారాయణ,పి కాలేశా, పోతురాజు,చింత శ్రీనివాసరావు, కటారి అశోక్, కొండారెడ్డి రాజేష్, పోతురాజు పాల్గొన్నారు.

నేడు టాలెంట్ టెస్టు

కొమరోలు : మండల పరిధిలోని అల్లీనగరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో సోమవారం ఛత్రపతి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి గురుస్వామి తెలిపారు. చత్రపతి శివాజీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 7,8,9 తరగతుల విద్యార్థులకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే ప్రతి విద్యార్థికి కన్సోలేషన్ బహుమతి, ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ టాలెంట్ టెస్టులో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.

వైసిపిలో తగ్గని వర్గపోరు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలంలో నిన్నటి వరకూ ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు వ్యతిరేకంగా గ్రూపు పోరు సాగింది. ప్రస్తుతం సంతనూతలపాడు నియోజక వర్గ అభ్యర్థిని వైసిపి అధిష్టానం మార్పు చేసింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా నియమించారు. అయినప్పటికీ గ్రూపుల సమసిపోలేదు. అధికారుల బదిలీలు, మండలంలో నిర్వహించే కార్యక్రమాలను ఏక పక్షంగా నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ గ్రూపు వారు మద్దిరాలపాడులోని వైసిపి కార్యాలయం సమావేశం నిర్వహించారు. మండలలోని ప్రధాన నాయకుడు, మంత్రిపై ఆరోపణలు చేశారు.ఈ క్రమంలో మరో గ్రూపు వారు ఇటీవల జరిగిన అధికారుల బదిలీల వ్యవహారం కొందరు అధికారుల తప్పిదం వల్లే జరిగినట్లు తెలిపారు. దీంతో రెండు గ్రూపుల మధ్య విభేదాలు రచ్చకెక్కినాయి. వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం రవి కుమార్ బదిలీ వెనక సొంత పార్టీలోని ఓ గ్రూపుకు చెందినవారి హస్తం ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. అయితే అసలు విషయం ఏమిటంటే మట్టిగుంట, ఒమ్మెవరం గ్రామాలలో స్వయం సహాయక గ్రామ సంఘాల నిధులను ఆయా గ్రామాల గ్రామ సంఘం అధ్యక్షులు స్వాహ చేశారు. డ్వాక్రా గ్రూపు మహిళలను మోసం చేసారు ఆ విషయంలో అక్రమాలకు పాల్పడిన గ్రామ సంఘం అధ్యక్షులపై ఎపిఎం చర్యలు తీసుకోలేదు. దీంతో డ్వాక్రా మహిళలు తమకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులను కలిసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎపిఎం రవికుమార్‌పై బదిలీ వేటు పడింది. ఈదుమూడి, ఒమ్మెవరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బెన్‌హర్ మహిళా వాలంటీర్ల పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో మహిళా వాలంటీర్లు తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ దినేష్ కుమార్‌కు బెన్‌హర్ తీరుపై ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టరు దినేష్ కుమార్ బెనహర్ ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఓ గ్రూపు వారు సమావేశం నిర్వహించి నిజనిజాలు తెలుసుకోకుండా మండలంలోని ప్రధాన నాయకుడు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మంత్రి మేరుగ నాగార్జున పై విమర్శలు, ఆరోపణలు చేయడం తగదని తెలిపారు. ఇప్పటికైనా అపోహలు వీడి అందరూ కలిసి పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని తెలిపారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని వడ్డెర కాలనీకి చెందిన 32 కుటుంబాల వారు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో చేరారు. ఎరిక్షన్‌బాబు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డిపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందన్నారు. అందుకే వైసిపి నుంచి టిడిపికిలోకి రాష్ట్ర వ్యాప్తంగా వలసలు పెరిగాయన్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపి తప్పక విజయం సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏరువ మల్లికార్జునరెడ్డి, భట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, అంబటి వీరారెడ్డి, దొడ్డా శేషాద్రి, సుబ్బరత్నం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టాల్లో ఉంటే.. చంద్రబాబు పట్టించుకున్నారా.?

(మొదటిపేజీ తరువాయి)

ఆశీర్వాదంతో, స్థానిక పరిస్థితులు అనుకూలించి అక్కడ తాను గెలవడం జరిగిందన్నారు. ఇందులో చంద్రబాబు పాత్ర ఏమి లేదన్నారు. చంద్రబాబుకు అంతశక్తే ఉంటే మంగళగిరిలో లోకేష్‌ను ఎందుకు గెలిపించుకోలేదని ప్రశ్నించారు. బల్లికురవ మండలం వేమవరంలో డబుల్ మర్డర్‌లు జరిగితే కార్యకర్తలకు అండగా చంద్రబాబు నిలబడలేదన్నారు. కనీసం వాళ్లకు కోర్టు ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వలేదన్నారు. చంద్రబాబునాయుడు రాజకీయ చరిత్ర ఏందో.. తన రాజకీయ చరిత్ర ఏందో ప్రజల ముందు పెట్టేందుకు తాను సిద్దంగా ఉన్నానన్నారు. చంద్రబాబు డబ్బులున్న నాయకులతోనే ఊరేగుతారని, డబ్బులు లేకపోతే ఆయనకు ఎవరూ పనికి రారని చెప్పారు. పార్టీ అధికారంలో లేకపోతే కార్యకర్తలే ప్రాణమంటారని, పార్టీ అధికారంలో ఉంటే వారిని అస్సలు పట్టించుకోరని వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ రిజక్ట్ చేసిన వాళ్లందరినీ పక్కన పెట్టుకొని ఏవేవో మాట్లాడితే సహించేది లేదన్నారు. మరోసారి తన జోలికి వస్తే బాగుండదని హెచ్చరించారు. తన టీంలో కరణం వెంకటేష్‌ను ఉంచాలని జగన్ కోరాడని, అందుకే జగన్‌తో కలిసి తాము నడవడం జరుగుతోందని చెప్పారు. తాను పార్టీ మారేటప్పుడు స్థానికంగా చీరాల నియోజకవర్గంలోని అందరితో చర్చించాకే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. మోడీ ఓడిపోతాడని ప్రచారం రావడంతో రాహుల్ గాంధీని కలిసి మెడలో దండేసిన వ్యక్తి చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మోడీ రెండోసారి గెలవడంతో ఆయన కోసం, ఆయన కాళ్లు పట్టుకునేందుకు పాకులాడుతున్న వ్యక్తి చంద్రబాబు అని వివరించారు. ఆయనలా పాకులాట తనకు చేతకాదన్నారు. చీరాలలో తాను టిడిపి టిక్కెట్ అడిగానని ప్రచారం చేస్తున్నారని, ఆ విషయం రుజువు చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పారు. చంద్రబాబుకు సిగ్గులేకపోతే.. తమకు సిగ్గుందని వ్యాఖ్యానించారు. తాను టిడిపి నుంచి బయటకు వచ్చిన తరువాత అస్సలు చంద్రబాబును ఎప్పుడు కలవలేదన్నారు. క్యాడర్‌ను కాపాడుకునేందుకు చంద్రబాబు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు తనకు అర్ధమవుతోందన్నారు. మరోసారి తనమీద అవాకులు చవాకులు పేలితే చూస్తూ సహించేది లేదని, ఎవరి బండారం ఏంటో నోరు విప్పి అన్నీ విషయాలు బయటపెట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. చంద్రబాబునాయుడు కార్పొరేట్ రాజకీయాలు చేస్తాడని, ఆయన కార్పొరేట్ రాజకీయాల వల్ల చాలా కుటుంబాలు బలైపోయాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి తరుపున చీరాల నియోజకవర్గం నుంచి తన కుమారుడు కరణం వెంకటేష్ పోటీ చేస్తారని బలరాం స్పష్టం చేశారు.

పార్టీలో ఉండి ద్రోహం చేయకండి..

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. కొండపి నియోజకవర్గంలో ఎంపీకి, ఎమ్మెల్యేకి సమానమైన ఓట్లు రావాలని సూచించారు. రాష్ట్ర మంత్రి సురేష్ మాట్లాడుతూ వాసన్న తన వెంట ఉంటే చాలని, కొండపి అంతా సెట్ చేసుకునే పనిలో ఉన్నానని చెప్పారు. అందరినీ కలుపుకొని పోయి కొండపిలో వైసీపీ జెండా ఎగరవేస్తానని వివరించారు. రీజనల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వాసన్న ఆధ్వర్యంలో పార్టీని గెలిపించుకొని జగన్‌కు ప్రకాశం జిల్లా నుంచి గిఫ్ట్‌గా ఇవ్వాలని సూచించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేద ప్రజల కోసమే వైయస్ రాజశేఖర్‌రెడ్డి పని చేశారని వివరించారు. ప్రభుత్వ న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ముఖ్య మంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలు మరవలేదన్నారు. ముందుగా దేవిశ్రీ ఫుడ్స్ వద్ద బైపాస్ నుంచి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పార్టీ అధ్యక్షులు సామంతుల రవికుమార్‌రెడ్డి, సర్పంచి తాడిపర్తి వనజ, తన్నీరు ధర్మరాజు, పామర్తి మాధవరావు, శీలం రాము, యన్నాబత్తిన చిన్న, యనమల మాధవి, రాపూరి ప్రభావతి పాల్గొన్నారు.

వాసన్న చెప్పాడు..సురేష్‌ని గెలిపించుకుంటాం..

ఆదివారం నాడు శింగరాయకొండలో జరిగిన వైసిపి సమావేశం జరుగుతున్న సమయంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఆసక్తికరమైన అంశాలు తెరపైకి తెచ్చారు. డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిని లేపి పార్టీలో అందర్నీ కలుపుకొని పోవాలని సూచించారు. అక్కడ ఉన్న సామంతుల రవికుమార్‌రెడ్డిని పిలిచి ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలని వైయస్.రాజశేఖర్‌రెడ్డి చెప్పిన మాటలు ఇవని.. గుర్తుపెట్టుకోవాలన్నారు. అందరూ కలిసి సురేష్‌ని గెలిపించుకోవాలన్నారు. అక్కడే ఉన్న శీలం రాముని పిలిచి అందరూ పనిచేయాలని సూచించగా తాను సిద్ధమేనని వివరించారు. మర్రిపూడి మండలానికి చెందిన నాగయ్యను అనే సీనియర్ నాయకుని పిలిచి.. అధికారం రాగానే నాగయ్యకు మంచి పదవి ఇవ్వాలని సురేష్‌కు సూచించారు. టంగుటూరు మండలం ఇంకా సెట్ కాలేదని, సెట్ అయ్యే విధంగా చూస్తామన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ ఉంటేనే మన ఆటలు సాగుతాయని అది గుర్తుపెట్టుకోవాలన్నారు. అయితే అక్కడ ఉన్న నాయకులందరూ వాసన్న చెప్పాడని.. మంత్రి సురేష్‌ను కొండపి నుంచి గెలిపించుకుంటామని చెప్పారు.

కార్యక్రమానికి దూరంగా నాయకులు..

ఈ కార్యక్రమానికి కొందరు వైసిపి నాయకులు దూరంగా ఉన్నారు. జిల్లాలోనే ఉన్న ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి సతీమణి ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీపీ, జడ్పీటిసి, కోఆప్షన్ సభ్యులతో పాటు శింగరాయకొండకు ముస్లిం మైనార్టీకి చెందిన నాయకులు కార్యక్రమానికి దూరంగా ఉండటం చర్చకు దారితీసింది.

NOTICE

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE:: TENALI

I.A. No. 143/2023, I.A. No.144/2023 & 145/2023 in O.S. No. 46 / 2022

Between:

Devireddy Poornaiah and Another. .... **Petitioners/Plaintiffs**

And

Madala Kanoj Kumar and Others. .... **Respondents /Defendants**

To,

R-8/D-8: Koganti Sowbhagya Lakshmi,W/o.Srinivasa Rao, R/o.Janakpuri, New Delhi,

R-9: Gerapati Karthikeya(Proposed Defendant), S/o. Late Madhu Sudana Rao, being minor Rep. by his guardian 4th respondent Alaparthi Uma Devi, W/o. Ravi Prasad, R/o.Yadlapalli(Vil),T Sundur Mandal, Bapatla Dist.

పైనెంబరు దావాలోని I.A.No.143/2023, I.A.No:144/2023 & I.A.No.145/2023 లలో 8&9వ రెస్పాండెంట్స్ /ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు వారి నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:24-02-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:24-02-2024

పరిశా రవీంద్ర బాబు,

పిటీషనర్లు/వాదులు తరపు అడ్వకేట్, గుంటూరు జిల్లా,సెల్:9848356442

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

OS No : 365/2024

మాకినేని అమృతవల్లి వగైరా .... వాదులు

V/s

కూనం వెంకట నారపరెడ్డి వగైరాలు ...ప్రతివాదులు

To

D2) మాకినేని జయసింహం,
తండ్రి వెంకట నరసింహం, వయసు 60 సం,
R/o గోసుకొండ అగ్రహారం, మర్రి పూడి మండలం,
తెల్లంపల్లి పోస్టు, ప్రకాశం జిల్లా.

D4) కాటూరి సుభాషిని,
W/o కాటూరి నారాయణ ప్రతాప్,
R/o నరసింహ నగర్, కాటూరివారిపాలెం గ్రామం,
పొదిలి మండలం, ప్రకాశం జిల్లా.

D5) సోంది పద్మ,
W/o సోంది రాజేష్ R/o ఆరో మోటార్స్ ,
హీరో మోటార్ సైకిల్ షోరూం,
పాత జడ్పీ ఆఫీస్ఎదురు , ట్రంక్ రోడ్, ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ ఓఎస్ 365/ 2014 సేల్ కమ్ జి.పి.ఎ కెన్సిలేషన్ ఇతరాలకు కొరకు దావా దాఖలు చేయగా పై కోర్టు వారు దావా సమన్లు మీకు పలుమార్లు పంపినప్పటికీ తీసుకోకుండా మీరు కాలయాపన చేయుచున్నందున పై శ్రీ కోర్టు వారు మీకు సమన్లు జారీ నిమిత్తం ఆర్డర్ వేసి ఉన్నారు. కావున మీరు గాని మీతరపున న్యాయవాది తేది 23-02-2024 న గాని ఉదయం 10:30 కి పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు లెని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలపడమైనది

ఇట్లు

కోలా శివప్రసాద్

అడ్వకేట్, ఒంగోలు

సెల్ : 9849210010

ఆదరిస్తే అభివృద్ధి చేస్తా : దద్దాల

ప్రజాశక్తి -కనిగిరి

తనను ఆదరించి గెలిపిస్తే వెనుకబడిన కనిగిరి ప్రాంతాన్ని అభివద్ధి చేసి చూపుతాని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. స్థానిక వైసిపి కార్యా లయంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వైసిపి ప్రభుత్వం కషి చేస్తుందని దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. పిడిసిసి బ్యాంకు చైర్మన్ వైఎం.ప్రసాద్ రెడ్డి, కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ యాదవ్ పరిచయ కార్యక్రమం ఈనెల 21న ఉదయం 10 గంటలకు కనిగిరి పట్టణంలోని పవిత్ర ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, వైసిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక చెక్ పోస్టు వద్ద నుంచి పవిత్ర కల్యాణ మండపం వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దద్దాల పరిచయ కార్యక్రమం, బహిరంగ సభ నిర్వహించన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కనిగిరి, పిసిపల్లి ఎంపిపి దంతులూరి ప్రకాశం, అత్యల జఫన్య, కనిగిరి జడ్‌పిటిసి మడతల కస్తూరి రెడ్డి, వైసిపి నాయకులు దేవకి వెంకటేశ్వర్లు, తమ్మినేని సుజాత రెడ్డి, తమ్మినేని సాయిరాం రెడ్డి, ఎస్.మోహన్ రెడ్డి, సిరుప గోవర్ధన్ రెడ్డి, వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్ రెడ్డి, కటికల వెంకటరత్నం, ఓకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్


మృతిచెందిన ముసలయ్య

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఒకరు మృతి

- ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి- ముండ్లమూరు

ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు.మరో ఐదుగురికి గాయాల య్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చంద్రగిరి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ వెంకట కృష్ణయ్య కథనం ప్రకారం... సంతనూతలపాడుకు చెందిన 9 మంది ఆటోలో బొప్పినీడివారిపాలెంలోని పోలేరమ్మ గుడికి వెళ్లారు. అక్కడ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటికి బయలు దేరారు. ఆటో చంద్రగిరి సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ ముసలయ్య (58) అక్కడిక్కడే మతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న తేజశ్వరి, రమాదేవి, బంగారమ్మ, వెంకట లక్ష్మి, దాసరి పసమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని దర్శి సిఐ షేక్ సమివుల్లా పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ వెంకట కష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని నాగరాజుకుంట గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మాధవరావు తెలిపారు.నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరులో 20 బాటిళ్లు స్వాధీనం

పొన్నలూరు :మండల పరిధిలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యకిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట రాజేష్ తెలిపారు. గ్రామానికి మాలకొండయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్ద 20 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని కోటపాడు గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి పదిమంది జూదరులను అరెస్టు చేసినట్లు రేణింగవరం ఎస్ఐ కెకె. తిరుపతిరావు తెలిపారు. నిందుల వద్ద నుంచి రూ. 1,02,360 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది కె.విజయ్ కుమార్, పి. సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే 'అన్నా'

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణానికి చెందిన న్యాయవాది కొండవీటి రామచంద్రరావు కుమార్తె వివాహ వేడుకల్లో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి మార్కాపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, ఎస్‌కె.నూర్జాహాన్ బేగం, యక్కలి శేషగిరిరావు, గునుపూడి చెంచు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు అందజేస్తున్న నాయకులు

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి సహకారంతో మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఎంపిపి కందుల వెంకటయ్య ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు లింగంగుంట్ల రాములు, వైసిపి నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, బూచేపల్లి వెంకటేశ్వర్లు, గొడుగు ఆంజనేయులు, ఆవుల రమణారెడ్డి, రమణారెడ్డి, అన్నపురెడ్డి శివారెడ్డి, రాంప్రసాద్, కంచర్ల దినేష్, మల్లెల బొర్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తారకరత్నకు ఘన నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సినీనటుడు, టిడిపి యువనేత దివంగత నందమూరి తారకరత్న లేని లోటు తీరనిదని టిడిపి మండల కన్వీపర్ చేకూరి సుబ్బారావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో దివంగత తారకతర్న పథమ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తారకరత్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, టిడిపి నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, పాలడుగు వెంకట కోటయ్య, షేక్ మస్తాన్‌వలి, గాలెయ్య, మంత్రూ నాయక్, మహేష్ నాయుడు, వెంకట్రావు గౌడ్, కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివి శంకరయ్యకు నివాళి

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని ఇలవర గ్రామంలో కామ్రేడ్ దివి శంకరయ్య 21వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దివి శంకరయ్య విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అభ్యసించాయన్నారు. కళాశాలలో చేరిన తరువాత నల్లూరి వెంకటేశ్వర్లు స్ఫూర్తితో అనేక ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. కొన్ని సందర్భరాల్లో అరెస్టు అయిన ఘటనలు కూడా ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో శంకరయ్య తనయుడు, గ్రామ నాయకులు దివి శ్రీనివాసులు, సిపిఐ, వైపిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మాధవరావు' పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగర డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు పుట్టినరోజు వేడుకలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేయర్ గంగాడ సుజాత, పలువురు కార్పొరేటర్లు మాధవరావు చేత పుట్టిన రోజు కేక్ కట్ చేయించారు. మాధవరావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తాడి కృష్ణలత, ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్యా, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, బేతంశెట్టి శైలజ, అంబటి ప్రసాదరావు, ఈదర వెంకట సురేష్‌బాబు, యనమల నాగరాజు, చింతపల్లి గోపి, ఇమ్రాన్‌ఖాన్, అంగిరేకుల గురవయ్య, బెంగుళూరు నరసయ్య, కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ సర్తాజ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ మాధవరావు

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-కొండపి

ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 34 మందికి రూ.38.99 లక్షల విలువైన చెక్కులు మంత్రి సురేష్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. కొండపి మండలంలో 6 మందికి రూ.7.98, మర్రిపూడి మండలంలో 6 మందికి రూ.6.10 లక్షలు, పొన్నలూరు మండలంలో 4 నలుగురికి రూ.3.68 వేలు, శింగరాయకొండ మండలంలో 7 మందికి రూ.4.77 లక్షలు, టంగుటూరు మండలంలో ఇద్దరి రూ.3.70 లక్షలు, జరుగుమల్లి మండలంలో 8 మందికి రూ.12.11 లక్షలు అందజేశారు.

ఇస్మాయిల్‌కు అవార్డు

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

యర్రగొండపాలెంనకు చెందిన ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్‌కు భారతదేశపు తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇస్లాయిల్‌కు అవార్డు అందజేశారు. ఇస్మాయిల్ ముస్లిం యూత్ సొసైటీ తరుపున సుమారు 1500 మందికి రక్తదానం చేయించారు. ఆయన సేవలను గుర్తించిన వల్లూరి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసరాజు మహనీయుల పురస్కార సేవ అవార్డు కార్యక్రమంలో భాగంగా షేక్ ఇస్మాయిల్‌కు ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, అడిషనల్ డిఎస్‌పి తేజవత్, సినీ నటులు, సంఖ్య శాస్త్ర నిపుణులు దైవాజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

750 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు పెద్దకాకాని శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో స్థానిక జవహర్ నగర్ కాలనీలో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని కందుల నారాయణ రెడ్డి ప్రారంభంచి మాట్లాడారు. గతంలో టిడిపి ఆధ్వర్యంలో మార్కాపురంలో అనేక కంటి వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ దాదాపు 2000 మందికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఇదే ఒరవడి భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు. కంటి వైద్య శిబిరానికి సహకరించిన శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం 750 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 205 మంది కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. విడతల వారీగా ప్రత్యేక వాహనాల్లో శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, షేక్ మౌలాలి, కొప్పుల శ్రీను, పి. గులాబ్ ఖాన్ జనసేన నాయకులు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో మేరుగ నాగార్జున

చంద్రబాబుపై మంత్రి నాగార్జున ఆగ్రహం

ప్రజాశక్తి - పర్చూరు

టిడిపి అధినేత చంద్రబాబుపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఫైర్ అయ్యారు. ఇంకొల్లులో జరిగిన రా కదలి రా సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబుపై ఆయన విరుచుకుపడ్డారు. చంద్రబాబు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. మరోసారి ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తే చంద్రబాబుపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని హెచ్చరించారు. కుమారుడు లోకేష్‌ను గెలిపించుకోలేని చేతకాని దద్దమ్మ చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోడవాడలో థాంక్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మాట్లాడారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి అభ్యర్థులు కారువయ్యారని అన్నారు. చంద్రబాబు మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. 40ఏళ్ల అనుభవం ఏమైందని ప్రశ్నించారు. టిడిపి పాలనలో దళితుల అవమానాలు ఎవ్వరూ మర్చిపోలేదని అన్నారు. జగన్‌ను ఎదుర్కొనలేక అందరినీ కలుపుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఎంత మంది ఏకమైనా జగన్‌ను ఏమీ చేయలేరని అన్నారు. 2024లో మళ్లీ గెలుపు తమదేనని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చార్వాక, డాక్టర్ ఐ బాబురావు, ఎం వెంకట్రావు, గెరా అశోక్ బాబు, మల్లెల బుల్లిబాబు, దార్ల శాస్త్రి, కె ఇషాక్ బాబు, వై చిన్న బాబు పాల్గొన్నారు.



2కే వాక్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ కొండలరావు

నడకతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - చీరాల

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, మానసిక ఒత్తుళ్లను ఎదుర్కొనేందుకు శరీర వ్యాయామంతోపాటు నడక ఎంతో ఆరోగ్యమని ఐకాన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ శంకరశెట్టి కొండలరావు అన్నారు. ఐకాన్ హాస్పిటల్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో 2కె వాక్‌ను ఆదివారం నిర్వహించారు. స్థానిక రోటరీ క్లబ్ నుండి ప్రారంభమైన వాక్ రైల్వే స్టేషన్, గడియార స్తంభం సెంటర్ మీదగా ఐకాన్ హాస్పిటల్ మీదగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నడక ఆరోగ్యానికి మంచిదని, ఆరోగ్యంగా ఉండటానికి నడవటం ఎంతైనా అవసరమని అన్నారు. వయస్సు పెరిగే కొద్ది ఎముకల్లో కాల్షియం తగ్గుతు రావడం సహజమని అన్నారు. వాటిలో జీవం పెరగడానికి క్రమం తప్పకుండా నడవడం ఎంతో మంచిదని అన్నారు. ఎముకలకు విటమిన్ డి ఎంతో అవసర మని అన్నారు. డి విటమిన్ సూర్యరశ్మిలో మాత్రమే దొరుకుతుందని అన్నారు. అది ఉచితంగా ఉదయం పూట సూర్యకిరణాల్లో ఉంటాయని అన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు మాట్లాడుతు నడక శరీరానికి వ్యాయామమని కొద్దిపాటి దూరంకు వాహనాలపై ఆధారపడకుండా నడిచి వెళ్ళటం మంచిదని అన్నారు. ఐకాన్ హాస్పిటల్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి రూ.5వేల విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం వైద్యులు ఆరోగ్య శిబిరానికి వచ్చిన వారికీ నరాలు, రక్తపరీక్షలతో పాటు ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లిపెద్ది శరత్, డాక్టర్ వై సునీల్ కిషోర్, డాక్టర్ తులసి రామ్, చీరాల కృష్ణమూర్తి, కార్యదర్శి బండారుపల్లి హేమంత్ కుమార్, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రసంగంతో

చీరాల రాజకీయంపై క్లారిటీ

◆ పలు సందేహాలను నివృత్తి చేసిన బాబు ప్రసంగం ◆ చీరాలల్లో కరణం, ఆమంచి భవిష్యత్ రాజకీయాలపై స్పష్టత

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రా కదిలి రా సభల్లో భాగంగా ఇంకొల్లులో జరిగిన సభలో దేశం అధినేత చంద్రబాబు చేసిన ప్రసంగం చీరాల్లోని రాజకీయ నేతల భవిష్యత్ అడుగులపై సందేహాలను నివృత్తి చేసింది. చీరాలలో గత కొంత కాలంగా ఏ నేతలు ఏ రాజకీయ పార్టి నుంచి పోటీ చేస్తారు. గెలిచాక ఎవరి రాజకీయ పయనం ఎలా ఉంటుంది అన్న విషయమై పలు పుకార్లు షికార్లు చేస్తూ వచ్చాయి. ఈ నేపధ్యంలో చంద్రబాబు ఇంకొల్లులో చీరాల రాజకీయాల గురించి చేసిన ప్రసంగం వాటన్నింటిని పటాపంచలు చేసింది.



ఇంకొల్లులో కదిలి రా.... సభలో చంద్రబాబు (ఫైల్‌ఫోటో)

జరుగుతున్న ప్రచారం ప్రకారం..

చీరాల నుంచి వైసిపి తరపున పోటీ చేస్తున్న కరణం వెంకటేష్ గెలిచిన అనంతరం టిడిపిలోకి వెళతారన్న ప్రచారం గత కొంతకాలంగా హల్‌చెల్ చేస్తుంది. ఈ ప్రచారాన్ని కరణం ప్రత్యర్థులే కాకుండా వారి కోటరిలో ఉన్నవారు కూడా చేస్తు వచ్చారు. ఈ ప్రచారం గురించి చీరాలలో ఉన్న టిడిపి నేతల ద్వారా లోకేష్‌కు, అక్కడి నుంచి చంద్రబాబు చెవిన పడినట్లు తెలుస్తుంది. ఇంకొల్లు సభలో బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో ఉన్న వైసిపి నేతలపై వరుస పెట్టి విమర్శలు సంధించిన చంద్రబాబు కరణం బలరాంపై కూడా మాటలతో విరుచుక పడ్డారు. 2019లో మనమే గెలిపించాం,. కష్టాల్లో ఉన్నప్పుడు ఏదో బావుకోవచ్చని పరిగెత్తి వెళ్ళాడు. మళ్ళీ గెలిపించండి టిడిపిలోకి వస్తామని చెబుతు న్నారని, రాను న్న ఎన్నికల్లో మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలంటూ వాఖ్యలు చేశారు. చంద్రబాబు కరణం బలరాంపై చేసి న తీవ్ర వాఖ్యలతో వారి కి టిడిపిలోకి ప్రవేశం లేదని బహిరంగంగానే స్పష్టం చేసినట్లయింది. కాగా కరణం భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై స్పష్టత వచ్చాకనే వైసిపి అధినేత జగన్ కరణం వెంకటేష్‌కు వైసిపి టిక్కెట్ ఖరారు చేసినట్లు చెబుతున్నారు. కాని స్థానికంగా మాత్రం ఎవరి ప్రయోజ నాల కోసం వారు కరణం బలరాం ఎన్నికల అనంతరం టిడిపిలోకి వెళతారన్న ప్రచారం చేస్తూ వచ్చారు. చంద్ర బాబు ప్రసంగంతో అలాంటి అవకాశం లేదని స్పష్టమయిం ది. దీంతో పాటు కరణం బలరామకృష్ణమూర్తి ఆదివారం విలేఖరుల సమావేశం పెట్టి చంద్రబాబు రాజకీయ వైఖరిని దుయ్యబట్టారు. ఈ పరిణామాలతో వైసిపి నేతలకు కూడా బలరామకృష్ణమూర్తి ఆయన కుమారుడు వెంకటేష్‌ల రాజకీయ ప్రయాణంపై స్పష్టత వచ్చినట్లయింది.

చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ రానున్న ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేస్తారని చెబుతున్నారు. అయితే ఏదైనా పార్టి నుంచి పోటీలో ఉంటారు? లేక స్వతంత్ర్య అభ్యర్థిగానా అన్నది వెల్లడి కాలేదు.

చీరాల నుంచి టిడిపి తరపున పోటీ చేసే అభ్యర్థి విషయమై పార్టి అధిష్ఠానం తర్జనబర్జనలు పడుతున్న నేపధ్యంలో ఆమంచి కృష్ణమోహన్ టిడిపి తరపున లేదా పొత్తులో భాగంగా జనసేన తరపున చీరాలల్లో పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతు వచ్చింది. అయితే ఇంకొల్లు సభలో చంద్రబాబు ఆమంచిని తీవ్రస్థాయిలో విమర్శించడం జరిగింది. మొన్నటి వరకు పర్చూరు ఇన్‌ఛార్జిగా అరాచకాలు, దుర్మార్గపు పనులు చేసిన ఆమంచి చిన్న సైకో అని వాఖ్యలు చేశారు. పర్చూరులో ఎమ్మెల్యే ఏలూరి దెబ్బకు ఆమంచి ఇంటిదారి పట్టారన్నారు. ఇలా ఆమంచి వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్న టిడిపి పెద్దలు ఒక వేళ పొత్తులో భాగంగా చీరాల జనసేనకు వెళ్ళినా అభ్యర్థి విషయంలో ఆమంచిని అంగీకరించే ప్రసక్తే ఉండదని తెలుస్తుంది. ఇలా ఒక దెబ్బకు రెండు పిట్టలు లాగా చంద్రబాబు చేసిన ప్రసంగం టిడిపిలో సదరు నేతలకు ప్రవేశం లేదన్న విషయాన్ని స్పష్టం చేసినట్లయింది. ఈ నేపథ్యంలో ఎంఎం కొండయ్యకు టిడిపి తరపున టిక్కెట్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది.

ఒపిఎస్ కోరుతూ యుటిఎఫ్ పోస్ట్ కార్డు ఉద్యమం



పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చేలా పోస్ట్ కార్డు ఉద్యామాన్ని చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడా వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉపాధ్యాయులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రలో సిపిఎస్ రద్దుచేస్తామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సిఎం అయ్యాక సిపిఎస్ రద్దు చేయకుండ కొత్తగా జిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులను దారుణంగా మోసం చేశాడని ఆరోపించారు. సిపిఎస్ ఉద్యోగుల నెలవారీ జీతంలో మినహాయింపు చేసుకున్న 10శాతం సొమ్ము మ్యాచింగ్‌గా ప్రభుత్వం ఇవ్వాల్సిన 10 శాతం సొమ్మును సిపిఎస్ ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకుండ ప్రభుత్వం దారి మళ్లించడం దారుణమని అన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని ప్రతి మండలం నుండి 45కి తగ్గకుండా పోస్ట్ కార్డులను పంపేలా యూటీఎఫ్ నాయకులు కృషి చేయాలని కోరారు. రానున్నది ఎన్నికల కాలమని, ఏ రాజకీయ పార్టీ అయితే సిపిఎస్ – జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకొని అధికారంలోకి వచ్చాక తొలి సంతకం ఓపిఎస్ ఫైల్‌పై పెడతామని హామీ ఇస్తారో వారికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరు మద్దతు ప్రకటిస్తారని స్పష్టం చేసారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నించే ఉపాధ్యాయ సంఘాలను బెదిరిస్తే భయపడే వారెవరు లేరని అన్నారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించిన ఉద్యామాలు ఈ ప్రభుత్వానికి కనువిప్పు కావాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ ఉద్యోగులను ఒక భాగంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కందిమళ్ల రవిబాబు, మండల అధ్యక్ష, కార్యదక్షులు బండారు ఆదినారాయణ, పోపూరి సునీల్ కుమార్, షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.

టిడిపి, జనసేన కూటమిదే అధికారం

శాసనసభ్యులు అనగాని సత్య ప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని ఎంఎల్ఎ అనగానీ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో అంకమ్మ చెట్టు సెంటర్ నుండి భారీ ర్యాలీతో బయలుదేరి 2, 3, 4, 5వార్డుల్లో జెండా దిమ్మలు ఆవిష్కరణ చేశారు. అనంతరం టిడిపి, జనసేన కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. జనసేన నూతన కార్యాలయాన్ని జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. వైసీపీ పాలనపై వ్యతిరేకతతో ఉన్న ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయాని చూస్తున్నారని అన్నారు. సీఎం



జనసేన కార్యాలయం ప్రారంభిస్తున్న నేతలు

జగన్‌రెడ్డి నియంతృత్వాన్ని భరించలేక వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడు తున్నారని అన్నారు. త్వరలోనే వైసీపీ ఖాళీ కావడం ఖాయమని అన్నారు. అప్పులకుప్పగా మార్చిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలకు అర్థమైందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ప్రతిఒక్కరిని మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గేటు లేని ఎంపీడీఒ కార్యాలయం

అసాంఘిక పనులకు వేదికైన ఎంపీడీవో కార్యాలయం

ప్రజాశక్తి - పంగులూరు

రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఎంపీడీఒ కార్యాలయానికి గేటు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మందు బాబులకు, వ్యభిచారులకు ఆశ్రమయ్యింది. గేటు నిర్మించాలనే ప్రతిపాదన ఏళ్ల తరబడి అమలుకు నోచుకోలేదు. మండల కేంద్రమైన పంగులూరులో 17ఏళ్ల క్రితం నిర్మించిన మండల పరిషత్ కార్యాలయానికి ప్రధాన గేటు ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. గతంలో గేటు తయారుచేసి కొంతకాలం కార్యాలయం దగ్గర పెట్టి తరువాత తీసుకెళ్లారు. తరువాత కాలంలో గేటు పెట్టాలని ప్రతిపాదన కొంతమంది అధికారులు చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఈ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. సాయంత్రం 6 గంటలు దాటిందంటే మందుబాబులు నేరుగా ఇక్కడికి వచ్చి మద్యం సేవించి, గ్లాసులు, సీసాలు, ఇతర పదార్థాలు ఇక్కడే పడవేసి పోతున్నారు. కొంత మంది వ్యభిచారులు కూడా ఇక్కడ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు ప్రచారం ఉంది. ప్రధాన గేటు లేకపోవడం, రాత్రి పూట వాచ్ మెన్ సౌకర్యం లేకపోవడంతో ఇందుకు కారణమని పలువురు భావిస్తున్నారు. అంతే కాకుండా గేట్ లేకపోవడం వలన గొర్రెలు, మేకలు, పశువులు కూడా లోపలికి వస్తున్నాయి. సెలవు రోజుల్లో అవి ఇక్కడ మొక్కలు తినడం వలన, ఇక్కడ వేసిన మొక్కలు మిగలటం లేదు. పందులు విరివిగానే తిరుగుతున్నాయి. అయినా పట్టించుకునేవారు లేరనేది స్థానికుల విమర్శిస్తున్నారు. కార్యాలయంలో రూ.లక్షల విలువచేసే కంప్యూటర్లు, ఇతర ఫర్నిచర్లు, ఫైల్స్ ఉన్నప్పటికీ ఇక్కడ వాటికి రక్షణ లేకపోవడం వలన ఎప్పుడు ఏం జరుగుతుందో అనే ఆందోళనలో కొంత మంది ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయానికి ప్రధాన గేటు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

పట్టణ యోగ స్పోర్ట్స్ అండ్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమవరం వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనాను ఆదివారం సన్మానించారు. నిత్యం వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలతో ఎంతో బిజీగా గడిపే రాహుల్ మీనా ఆటవిడుపులో భాగంగా డాక్టర్ వైయస్సార్ క్రీడా వికాస కేంద్రానికి వచ్చారు. కొద్దిసేపు సరదాగా షటిల్ అడారు. షటిల్ అడుతున్నంత సేపు సహచర ప్లేయర్స్‌తో కలివిడిగా మాట్లాడుతూ గడిపారు. మొదటి సారిగా క్రీడా ప్రాంగణానికి వచ్చిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనా కు పట్టణ యోగ స్పోర్ట్స్ అండ్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమవరం వెంకటేశ్వర రెడ్డి సాదర స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాహుల్ మీనా మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో యాంత్రిక జీవనం వైపు పరిగెడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో దైనందిన జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరం కావచ్చునని తెలిపారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్య వంతంగా జీవించవచ్చునని తెలిపారు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామంతో పాటు క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ యోగ స్పోర్ట్స్ అండ్ క్లబ్ అసోసియేషన్ కమిటీకి సబ్ కలెక్టర్ రాహుల్ మీనా కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి తిమ్మిశెట్టి సత్యం, పిన్నిక చక్రపాణి పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ రాహుల్ మీనాను సన్మానిస్తున్న పట్టణ యోగ స్పోర్ట్స్ అండ్ క్లబ్ అసోసియేషన్ నాయకులు



టిడిపిలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మండలం వంగపాడు పంచాయతీ పరిధిలోని ఎగువపల్లి ఎస్‌సి కాలనీ చెందిన పది కుటుంబాల వారు టిడిపిలో చేరారు. టిడిపి నాయకుడు సత్యం, టిడిపి మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో వారు ఆదివారం టిడిపిలో చేరారు. డాక్టర్ ఉగ్ర వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో మన్నేపల్లి సుశీలరావు, నారాయణ ,సాల్మన్, రవి ,లోకేష్, చిన్న, పోలయ్య, చిన్న, యాకోబు, దిన తదితరులు ఉన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గిద్దలూరు

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. గిద్దలూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాంతీయ వైద్యశాలను ఆంధ్ర ప్రదేశ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి నాగార్జున రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిద్దలూరు పరిసర ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దష్టిలో ఉంచుకొని సిఎం జగన్ సహాయ సహకారాలతో రూ.24 కోట్లతో వంద పడకలతో ప్రాంతీయ ప్రజా వైద్యశాలను నిర్మించినట్లు తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గ అభివద్ధికి సిఎం జగన్ ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వైద్య రంగానికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వైద్యశాల సూపరిండెంట్ సూరిబాబు, ఎంపిపి కడప లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పులి రామకష్ణ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ఓబుల్ రావు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

వివాహ వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి, దర్శి

స్థానిక అద్దంకి రోడ్డులోని శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య నాయకులు సముద్రాల రామకృష్ణ కుమార్తె వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, వైపిపి నియోజక వర్గ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పొదిలి రోడ్డులో నాగేంద్ర సాల్మన్ ఏర్పాటు చేసిన వాటర్ సర్వీసు సెంటర్‌ను ప్రారంభించారు. పొదిలి రోడ్డులో పార్టీ కార్యకర్త ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను బూచేపల్లి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, ఎఎంసి చైర్మన్ మిల్లర్ బుజ్జి, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌ఎం.బాషా, పట్టణ అధ్యక్షుడు హరీష్, నాయకులు శ్రీను, రాజశేఖర్‌రెడ్డి, ఉదయ భాస్కర్, కోటేశ్వరరావు,శ్రీనివాసులు పాల్గొన్నారు.



వధూరులను ఆశీర్వదిస్తున్న గరికపాటి వెంకట్

గరికపాటి వెంకట్ ఆశీర్వాదం

ప్రజాశక్తి- దర్శి

మండల పరిధిలోని తూర్పువెంకటాపురంలో టిడిపి నాయకుడు బాశం పిచ్చయ్య, వెంకటరమణ దంపతుల కుమార్తె లక్ష్మీ ప్రవళిక వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు గరికపాటి వెంకట్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశ్వీరదించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి -కనిగిరి

పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నం సింహారెడ్డి తెలిపారు. కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో జనని చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర నేత్రాలయం వారి సహకారంతో డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కాజల్, శ్యామ్ దీప్ 236 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 173 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. తొలి విడతగా 50 మందిని ఉగ్రనరసింహారెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో కంటి ఆపరేషన్‌ను తరలించారు. రెండో విడతగా ఈనెల 19న 60 మంది, 3వ విడతగా ఈనెల 20న 50 మంది కంటి ఆపరేషన్‌ను తరలించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా పేదల సంక్షేమం కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపికో ఆర్డినేటర్లు షేక్ జంషీర్ అహ్మద్, మారనేని రామ కష్ణ, నాగరాజు, జింకా మధు, కాశీ, దసరథ, రాము, రోశయ్య, ఖాజా, రెహమాన్, వెంకటరెడ్డి, దస్తగిరి, ఖాసీం, కొండలు పాల్గొన్నారు.




వృద్ధులతో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మాజీ సర్పంచి, రాష్ట్ర ఫుడ్ కమీషన్ మాజీ సభ్యురాలు స్వర్ణ గీత వెంకటేశ్వరరావు కుమారుడు డాక్టర్ ప్రీతమ్, డాక్టర్ హేమరాజశ్రీ వివాహ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులను ఆశ్వీరదించిన వారిలో ఎపిఐఐసి చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి, జడ్‌పి మాజీ చైర్మన్, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మార్కాపురం, దర్శి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, నారపుశెట్టి పాపారావు,టిడిపి నాయకుల ు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి



వధూవరులను ఆశీర్వస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల, తదితరులు



పోస్టు బాక్కులో కార్డులు వేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి...

పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-చీమకుర్తి

సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఒపిఎస్ (పాతపెన్షను స్కీమ్) పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పోస్టు బాక్కులో ఆదివారం పోస్టు కార్డులు వేశారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షను పునరుద్ధరణ అంశాన్ని రాజకీయ పార్టీలు తమ మేనిపెస్టోలో చేర్చాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ అక్బర్, చలువాది శ్రీనివాసరావు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు చల్లా శ్రీనివాస్, ఎన్‌పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'అంజుమన్ కమిటీ'లో రసవత్తర పోరు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని అంజుమన్ కమిటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 1240మంది ఓటర్లలో 90శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి వెంకటేశులు స్వయంగా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. వెయ్యి మందికిపైగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. ఎన్నడూ లేని విధంగా ఈసారి అంజుమన్ కమిటీ ఓటర్లలో చైతన్యం బాగా పెరిగింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అంజుమన్ కమిటీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ కమిటీ ఎన్నికలను ప్రతి మూడేళ్ళ కొకసారి నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 28సార్లు ఎన్నికలు జరిగాయి. 29వ సారి జరుగుతున్న ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి అభ్యర్థులు రంగంలోకి దిగారు. అంజుమన్ కమిటీకి అనేకమంది ప్రముఖులు అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి వన్నె తెచ్చారు. ముస్లిం ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నారు. నిరుపేద యువతుల పెళ్లిళ్ళు, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం వంటి అనేక కార్యక్రమాలను కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. అంజుమన్ కమిటీ నిర్వాహణలో సమర్థత కలిగిన కమిటీని ఎన్నుకోవాలని ముస్లిం నాయకులు అంటున్నారు. చాలా సందర్భాల్లో గతంలో పనిచేసిన కమిటీపై ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి ఆరోపణలు పునరావృతం కాకుండా నిర్మాణాత్మకమైన సహకారాన్ని అందించే వ్యక్తులనే ఎన్నుకుంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. పోలింగ్ సందర్భంగా అనేక మంది అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ప్రచారం చేశారు. చేతిలో గుర్తులు పట్టుకొని ఓటు వేయాలని ఓట్లను అభ్యర్థించారు. దీంతో డిఎస్పి వెంకటేశులు స్వయంగా రంగంలోకి దిగారు. ప్రచారాన్ని నిర్వహిస్తున్న అభ్యర్థులను పోలింగ్ జరిగే ప్రాంగణం నుండి బయటకు పంపేశారు. అధ్యక్షులు, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, 13మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. 29మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. కౌంటింగ్ జరుగుతుంది.



ఓట్ల లెక్కిస్తున్న సిబ్బంది

రూ.కోటితో తూర్పు సత్రం అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక తూర్పు సత్రం అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు ఎంఎల్ఎ కోన రఘుపతి వెల్లడించారు. తూర్పు సత్రంలో జరిగే అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి దీవి వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించారు. సభలో రఘుపతి మాట్లాడుతూ పట్టణంలో అతి పురాతనమైన తూర్పు సత్రం అభివృద్ధికి దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారని అన్నారు. పేరం గరుడాచలం నాయుడు సహకారంతో ఏర్పాటైన తూర్పు సత్రం గత కొన్నేళ్లుగా ఆలనా పాలనా లేకపోవడంతో కర్మకాండలు చేసుకునేందుకు వీలుగా ఇక్కడ అనేక సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. శిథిలావస్థకు చేరిన సత్రాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. సత్రం ప్రాంగణంలో అపర కర్మల భవనాన్ని రూ.కోటితో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చాపల సుబ్రహ్మణ్యం, చిలకమర్తి శ్రీరామ శర్మ, నారాయణరెడ్డి, బుల్లిరెడ్డి, మాల్యాద్రి, రమణ బాబు పాల్గొన్నారు.



తూర్పు సత్రంలో అపర కర్మల భవనానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న డిబిఆర్సి సెక్రటరీ అల్లాడి దేవకుమార్

సాధనతోనే లక్ష్యం చేరుకోవచ్చు

ప్రజాశక్తి - చీరాల

స్థానియ సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాల్లో గత 45రోజులుగా సెయింట్ మార్క్స్ లూథరన్ కళాశాల, డిబిఆర్సి, ఇతర ప్రజా సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రూప్ - 2 ఉచిత శిక్షణ తరగతులు నేటితో ముగిశాయి. గత నెల 7నుండి నిర్విరామంగా సాగిన శిక్షణా తరగతులకు ప్రతిరోజు 100మంది వరకు అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రఖ్యాతి గడించిన అధ్యాపక బృందంతో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ ముగింపు సభలో డిబిఆర్సి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ మాట్లాడారు. శిక్షణ తరగతుల నిర్వాహకులు పి జయశీలరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి శిక్షణ తరగతులు నిర్వహించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బందిని, ప్రజా సంఘాలను అభినందించారు. సాధన ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమేనని అన్నారు. యువత మంచి దినచర్య కలిగినప్పుడు మంచి స్థానాలను చేరుకుంటారని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగంలో కేవలం 2శాతం మాత్రమే ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయని ఎంతో కఠినమైన సాధన ద్వారా సిద్ధపడిన వారికే ఆ రెండు శాతం మందిలో అవకాశం ఉంటుందనే విషయాన్ని గుర్తు చేశారు. శిక్షణకు హాజరైన వారిలో మహిళలు ఎక్కువగా ఉండడాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మహిళల అభివృద్ధితోనే సమాజ అభివృద్ధిని లెక్కిస్తారని అన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలను ఆయన గుర్తు చేశారు. మహిళ చదువుకొని ప్రయోజకురాలైనప్పుడే సమాజం, కుటుంబం వృద్ధి చెందుతుందని అన్నారు. శిక్షణకు హాజరైన వారంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రూప్ - 1 అధికారి రాయుడు రవికుమార్ మాట్లాడుతూ చీరాల పరిసర ప్రాంతాల అభ్యర్థుల ప్రయోజనాల కోసం ఉచిత శిక్షణా తరగతులు కొనసాగిస్తున్న లూథరన్ కళాశాల సిబ్బందిని అభినందించారు. పరీక్షల్లో పాటించాల్సిన మెలకువలను తెలిపారు. శిక్షణ తరగతుల నిర్వాహకులు, ఎపి ఎయిడెడ్ జూనియర్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షులు గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ శిక్షణకు హాజరైన అభ్యర్థులు ఎంతో క్రమశిక్షణతో వీటిని విజయవంతం చేశారని అన్నారు. ఈ నెల 25న జరగనున్న ప్రిలిమ్స్ పరీక్షలు అందరూ విజయం సాధించాలని అన్నారు. లాభాపేక్ష లేకుండా పేద విద్యార్థినీ, విద్యార్థుల ప్రయోజనాల కోసం, ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి వందేళ్ల క్రితం కళాశాల ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ వారసత్వ తాను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కృషిలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు, డిబిఆర్సి ఏరియా కోఆర్డినేటర్ వి భగవాన్ దాస్, ఎజ్రా, వి ఐజాక్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య

ప్రజల కోసం సూపర్‌సిక్స్ పథకాలు

ప్రజాశక్తి - చీరాల

జగన్ తుగ్లక్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కష్టాలను, కన్నీటిని తుడిచేందుకు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారని టిడిపి ఇంచార్జి ఎం ఎం కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. రా కదలిరా సభ విజయవంతం చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తెలుగు జాతిని అగ్రపథంలో నిలిపేందుకు టిడిపి చేపట్టిన మహా యజ్ఞమే బాబు సూపర్ సిక్స్ అన్నారు. ఎన్నికలకు ముందు ఇంట్లోని పిల్లలందరికీ అమ్మఒడిని ఇస్తానని హామీ ఇచ్చిన జగన్ గెలిచిన తర్వాత ఇంట్లో ఒక్క చిన్నారికే పరిమితం చేశారని ఆరోపించారు. 45ఏళ్ళ నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు పింఛన్లు అందజేస్తామని ఇచ్చిన హామీని జగన్‌రెడ్డి గాలికి వదిలేశారని అన్నారు. బాబు సూపర్ పథకాలు చూసి జగన్‌రెడ్డి నిరుత్సాహానికి గురయ్యారని అన్నారు. జగన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన నవరత్నాల హామీ ఇప్పుడు నవమోసాలుగా మారాయని అన్నారు. జగన్ రెడ్డి ఓటమికి దేవుడు ముందే స్క్రిప్ట్ రాశాడని అన్నారు. జగన్‌రెడ్డి బీసీ వర్గాల 27సంక్షేమ పథకాలను రద్దు చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 10శాతం తగ్గించి, 16,500 బీసీలకు రాజకీయ ప్రాధాన్యత పోగొట్టారని అన్నారు. అన్న క్యాంటీన్, పెళ్లి కానుక, చంద్రన్న బీమా, విదేశీ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, 6లక్షల మంది వృద్ధులకు ఆగిపోయిన పెన్షన్, బిందు సేద్యం వంటి పథకాలను జగన్ రద్దు చేశారని అన్నారు. రాష్ట్రంలో బిసిలతోపాటు ఎస్‌సిల అభివృద్ధికి ఉన్న సంక్షేమ పథకాలను కూడా రద్దు చేశారని అన్నారు. టిడిపి ప్రభుత్వం ఎస్‌సి విద్యార్థులకు కార్పొరేట్ చదువులను అందుబాటులోకి తెచ్చేందుకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళిత కాలనీల్లో అభివృద్ధి లేకుండా చేశారని అన్నారు. స్వయం ఉపాధి పథకాలకు ఒక్కరికి కూడా రుణం ఇవ్వలేదని అన్నారు. సబ్సిడీల్లో కోత విధించారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జనార్దన్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో వైసిపి ఇన్‌ఛార్జి పానెం హనిమిరెడ్డి పాల్గొననున్నారు. గుంటుపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఎస్సీ కాలనీలోని సిసి రోడ్లు, డ్రైనేజీ, అసిస్ట్ కాలనీలోనే సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలను, వల్లాపల్లిలో ఎంపీ నిధులతో వేసిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభిస్తారని తెలిపారు.



వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఆనందబాబు

వివాహ వేడుకల్లో ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదలంక గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మన్నే వీరయ్య చౌదరి కుమార్తె వివాహ వేడుకల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆదివారం పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి తనుకుంట్ల సాయిబాబా, రైతు సంఘం నాయకులు వేములపల్లి జగన్నాధరావు, నూతక్కి దినకరబాబు, మోటూరు పున్నశ్రీనివాసరావు ఉన్నారు. వేమూరు మండలం కుచ్చెర్లపాడు గ్రామంలో గంగానమ్మ తల్లి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సింహ వాహన బలిపీఠం శిఖర మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వేమూరు మండలం జంపని గ్రామాలు జరుగులమ్మ అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణంలో పాల్గొన్నారు. వేమూరు గ్రామంలో టిడిపి నాయకులు అమిరినేని శ్రీనివాసరావు నూతన గృహప్రవేశంలో పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, జనసేన ఇన్‌ఛార్జి ఊస రాజేష్ ఉన్నారు.



వైసిపిలో చేరుతున్న అమర్తలూరు టిడిపి నేతలు

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - వేమూరు

అమృతలూరు దళితవాడకు చెందిన 25కుటుంబాలు టిడిపి నుండి వైసిపిలో శనివారం చేరారు. వైసిపి వేమూరు నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు వైసిపి కండువాలు మెడలో వేసి ఆహ్వానించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలో పని చేయాలని నిశ్చయించుకొని చేరుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పాలన ముందుకు కొనసాగాలంటే మరో సారి జగన్మోహన్‌రెడ్డి సిఎం కావాలని అన్నారు. అందరూ ఐక్యంగా వైసిపిని గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఏకమైనా ప్రజలంతా జగన్‌ను మరోసారి సిఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అశోక్‌బాబు అన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నరేంద్ర వర్మ

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర ప్రజల ఉజ్వల భవితకు టిడిపి, జనసేన అధికారంలోకి రావాలని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఇంటింటికి టిడిపి, మీ మాట - నా బాట, జనసేన, టిడిపి జనబాటలో భాగంగా మండలంలోని మద్దిబోయినవారి పాలెం, రామ్ నగర్, ఆదర్శ్ నగర్ గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు చీర, చేతి సంచి పంపిణీ చేశారు. నరేంద్ర వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే టిడిపి, జనసేన అధికారంలోకి రావాలని అన్నారు. ఐదేళ్ల వైసిపి పరిపాలనలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు మోసపోయారని అన్నారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని అన్నారు. ఆర్టీసీ ఛార్జీలతోపాటు చెత్తపన్నులు వేసి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమలు రాక యువత నిరుద్యోగులుగా ఉన్నారని అన్నారు. 2024లో టిడిపి అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

సౌత్ జోన్ టి-20 నిర్వహించటం సంతోషదాయకం

• ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి • టి-20 ప్రీమియర్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మెగా సౌత్‌జోన్ టి-20 క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ఒంగోలులో నిర్వహించటం సందోషదాయకమని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సిఎస్ఆర్ శర్మ కళాశాల క్రీడామైదానంలో మెగా మెగా సౌత్‌జోన్ టి-20 క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తో కలిసి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. ఒంగోలులో ఈ టోర్నమెంట్ నిర్వహించటం ఆనందంగా ఉందని అన్నారు. నిర్వాహకు ఇందుర్తి డుంబును అభినందించారు. ప్రీమియర్ లీగ్ ఈనెల 18 నుంచి 25వరకు జరగుతాయని, మొదటి బహుమతి రూ.4లక్షలు, 2వ బహుమతి రూ.2లక్షలు, మూడో బహుమతి రూ.లక్ష, నాల్గో బహుమతి రూ.50వేలు అందజేస్తామని తెలియజేశారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రీమియర్ లీగ్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఒంగోలు, తిరుపతి శుభారంభం

ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఆదివారం ఉదయం మెగా వారియర్స్ (విజయవాడ) ఎస్ఆర్‌సి లెవన్ (ఒంగోలు) జట్ల మధ్య మ్యాచ్‌లో ఒంగోలు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన విజయవాడ జట్టు 20 ఓవర్‌లలో 9 వికెట్ల నష్టానికి 155పరుగులు సాధించింది. ఒంగోలు జట్టు 16.2 ఓవర్‌లలో 4 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసి గెలుపును అందుకుంది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో హైపీరియన్ (తిరుపతి), ఆస్పైర్ (హైదరాబాద్) తిరుపతి జట్టు గెలిచింది. మొదటి బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న బాలినేని, చెవిరెడ్డి, సురేష్

నిర్ణీత 20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. అనంతరం హైదరాబాద్ జట్టు కేవలం 89 పరుగులు ఆలౌట్ ఆయింది. హైపీరియన్ జట్టు 69 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ అయినాబత్తిని ఘనశ్యామ్, పిడిసిపి మాజీ కార్యదర్శి చింతపల్లి ప్రతాప్ కుమార్, ఇందుర్తి డుంబు, సురేష్, తోట శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వై.పాలెంలో వేడెక్కుతున్న రాజకీయం

ప్రజలతో మమేకమవుతున్న ఇరు పార్టీల నాయకులు • మళ్లీ గెలవాలని వైసీపీ.. బోణీ కొట్టాలని టిడిపి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీకి కంచుకోటగా ఉన్న యర్రగొండపాలెంలో తిరిగి హ్యాట్రిక్ సాధించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పావులు కదుపుతుండగా ఎలాగైనా వైసీపీ కోటను బద్దలుకొట్టి పాగా వేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల అభ్యర్థులు నియోజక వర్గంలోని ఏదో ఒక గ్రామానికి వెళ్లి కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. ప్రజలతో మమేకమవుతున్నారు. నీటి సమస్యతో పాటు చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరిస్తున్నారు. ఒకరి పార్టీపై ఒకరు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.

వైసీపీ కంచుకోటను బద్దలు కొడతాం..

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తన పదునైన వాగ్దాటితో వైసిపిపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందంటూ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. దమ్ముంటే ప్రాజెక్టు వద్దకు వస్తాం ఏం పూర్తయిందో చూపించాలని సవాల్ విసిరారు. కొండకు కన్నం పెట్టి ప్రాజెక్టు పూర్తయిందని చెబితే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. సొరంగంలో రివిట్‌మెంట్ పనే పూర్తి కాలేదని, హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం మొదలే కాలేదని అన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి నీరు పారే కాలువలు తవ్వి ఏళ్లు గడిచిందని, కాలువలు మెయింటెనెన్స్ లేక పూడిపోయాయని చెబుతున్నారు. రిజర్వాయర్ నుంచి నిర్వాసితులను ఖాళీ చేయించాలంటే నిర్వాసితులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని, ఆర్ఆర్ ప్యాకేజీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. నిర్వాసితుల కోసం నిర్మించిన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని, రోడ్లు, తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు పూర్తి కాలేదని అన్నారు. నాలుగున్నర సంవత్సరాలు కాలయాపన చేసిన ప్రభుత్వం ఎన్నికలు దగ్గర పడగానే సొరంగం ఫొటోలు చూపించి ప్రాజెక్టు పూర్తి చేశామని ప్రజలకు అబద్ధాలు చెబుతోందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఎక్కడైనా ఒక్క రోడ్డయినా తాము వేశామని చూపించగలరా అని ప్రశ్నించారు. రెండు పర్యాయాలు ఓటు వేసి గెలిపిస్తే పది



గూడూరి ఎరిక్షన్‌బాబు, తాటిపర్తి చంద్రశేఖర్

సంవత్సరాలు ప్రజలను గాలికొదిలేశారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా భూకబ్జాలు, ఆక్రమణల వెనక వైసిపి నాయకులే కనపడుతున్నారని అన్నారు. జరగనున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానన్నారు. ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచేది తానేనని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఎరిక్షన్‌బాబు తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభించింది ముఖ్యమంత్రిగా చంద్రబాబేనని, తిరిగి పూర్తి చేసి ప్రారంభించేది కూడా ఆయనేనని అంటున్నారు.

మరోసారి గెలుస్తాం..

వైసిపికి కంచుకోట లాంటి యర్రగొండపాలెం నియోజకవర్గంలో మరోసారి గెలుపొంది జగనన్నకు కానుకగా ఇస్తానని వైసీపీ ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అంటున్నారు. వెలుగొండ ప్రాజెక్టు రెండో సొరంగం రికార్డు సమయంలో పూర్తి చేశారని, వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ముఖ్యమంత్రిగా ప్రారంభించేది జగనన్నేనని అంటున్నారు. ఈ నెలలోనే వెలుగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టు నీటి ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గం సస్యశ్యామలం కానుందని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన తర్వాత రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ప్రాజెక్టుకు నిధులు ఎంత మంజూరు చేశారో చెబితే టిడిపి నాయకుల నిజ స్వరూపం బయటపడుతుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, టిడిపి నాయకుల మోసపూరిత మాటలు ప్రజలు నమ్మడం లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలకు లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలకు జమ అయ్యాయని అన్నారు. రాష్ట్రంలో జగనన్న కాలనీలు, విద్యా దీవెన, రైతు బంధు, ఆరోగ్య సురక్షవంటి పథకాలు దేశంలోనే పేరొందిన పథకాలని తెలిపారు. రాష్ట్రంలో సామాజిక సాధికారతను సాధించిన మొట్టమొదటి ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని అన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే అవసరమైన పత్రాలను అందజేస్తున్నారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు రైతన్నలకు అందుబాటులో సేవలందించడం దేశంలో మరెక్కడా లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత స్థాయి పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి అద్భుతమైన ఫలితాలను సాధించిందని, విద్యార్థుల స్థాయి జాతీయ స్థాయిలో పోటీపడే స్థాయికి తీసుకెళ్లిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తృతపరచి ఆరోగ్య రంగంలో ప్రగతి సాధించిందన్నారు. విద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక రంగాలలో గణనీయమైన పురోగతి సాధించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయన్నారు. నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా ప్రజల ఆదరాభిమానాలు చూస్తుంటే జరుగనున్న ఎన్నికల్లో యర్రగొండపాలెంలో వైసిపికి రికార్డు మెజారిటీ ఖాయమని జోస్యం చెప్పారు.

ఉదయం ఒక కండువా..రాత్రికి మరో కండువా

కాగా గ్రామాల్లో ప్రజలపై ఇరు పార్టీల నాయకుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. మా పార్టీలో చేరాలంటూ మా పార్టీలో చేరాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. మా పార్టీలో చేరితేనే సంక్షేమ పథకాలు అందుతాయని, మంచినీటి సమస్య పరిష్కరిస్తామని చెబుతుండడంతో గ్రామస్థాయిలో ఇబ్బందుల్లో ఉన్న ప్రజలు వారి ఒత్తిడికి తట్టుకోలేక వైసీపీ కండువా కప్పుకొని వైసీపీలో చేరితే.. రాత్రికి తిరిగి వారే టిడిపి కండువా కప్పుకొని టిడిపిలో చేరుతున్నారు. మరికొన్ని చోట్ల ఎవరి పార్టీల వారికి వాళ్లే కండువాలు కప్పి కొత్తగా పార్టీలో చేరినట్లు ప్రకటిస్తున్నారు. ఇలా ఇరు పార్టీలు ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. మరి ఓటర్లు ఎవరిని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

9న లోక్ అదాలత్

ప్రజాశక్తి- దర్శి

లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఎక్కువ సంఖ్యలో రాజీ పడేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి శివశంకర్ తెలిపారు. మార్చి 9వ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా న్యాయవాదులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకొనేలా చూడాలన్నారు. కేసులు రాజీ పడితే సబయం, డబ్బు వృథా కాదని తెలిపారు. రాజీయే రాజమార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- రాచర్ల

మండల పరిధిలోని సోమిదేవిపల్లె గ్రామానికి చెందిన బత్తుల వెంకటరాజు (40) అనే ఆర్మీ జవాను గురువారం రాత్రి గుండెపోటుతోకోల్‌కత్తాలో మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని



నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ

స్వగ్రామైన సోమిదేవిపల్లికి ఆదివారం తీసుకొచ్చారు. అందులో భాగంగా వైసిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి సందర్శించి నివాలర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా విజయ

ప్రజాశక్తి-పొదిలి

జిల్లా ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా పొదిలి-1 సచివాలయ ఎఎన్ఎం కె విజయ , జాయింట్ సెక్రటరీగా కె నాగభూషణమ్మ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ అధ్యక్షుడిగా నజరుద్దీన్

ప్రజాశక్తి-పొదిలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా షేక్ నజరుద్దీన్ నియమితులయ్యారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఒంగోలులో నియమాక ఉత్తర్వులు అందజేశారు. కొనకనమిట్ల అధ్యక్షుడిగా దర్శాసి సుబ్బారావు, తర్లుపాడు అధ్యక్షుడిగా షేక్ బడే సాహెబ్‌ను నియమించారు.



దహన వాటిక ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, విజయ్

శవ దహన పేటిక ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక అద్దేపల్లి గ్రామంలోని హిందూ స్మశాన వాటికలో దాతలు బొలిశెట్టి శ్రీనివాసరావు, విజయకుమార్, బొలిశెట్టి జయబాబు సహకారంతో ఏర్పాటు చేసిన దహన వాటికను ఆదివారం ప్రారంభించారు. రూ.4లక్షల వ్యయంతో నిర్మించిన దహన వాటికకు దుక్కు, ఇనుప బట్టిలను కూడా అమర్చి దహన సంస్కారాలకు సిద్ధం చేశారు. ఇందుకు సహకరించిన బొలిశెట్టి జయబాబు దంపతులను గ్రామస్తులు సన్మానించి అభినందించారు. సర్పంచ్ ధారా రవికిరణ్మయి మాట్లాడుతూ హిందూ స్మశాన వాటికకు అవసరమైన సౌకర్యాలను పంచాయతీ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుట్ల సాయిబాబా మాట్లాడుతూ రానున్న రోజుల్లో హిందూ స్మశాన వాటిక పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. అంతిమ సంస్కరాలు నిర్వహించుకునేందుకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పించేందుకు గ్రామస్థులు ముందుకు రావాలని బొలిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పసుపులేటి శివరామప్రసాద్, తటవర్తి శ్రీనివాసరావు, కాలేపల్లి శ్రీనివాసరావు, బొలిశెట్టి సునీల్, తిరువీధుల బాలాజీ పాల్గొన్నారు.



బస్టాండ్లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

సీఎం సభకెళ్లిన బస్సులు

ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి - చీరాల

ఆర్టీసీ డిపోలో బస్సుల కొరతతో ప్రయాణికులు తీవ్ర ఆగచాట్లు పడుతున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సభకు చీరాల డిపో నుంచి 15బస్సులు తరలించారు. చీరాల డిపో నుండి ఇంకొల్లు, పెదగంజాం, స్వర్ణ, రేపల్లె, నిజాంపట్నంకు బస్సు లేక ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు. చీరాల నుండి విజయవాడ, ఒంగోలుకు అరకొరగా బస్సులు నడుస్తున్నాయి. బస్సులు లేక పోవడంతో ప్రజలు అధికార పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీంతో చేసేది ఏమిలేక పలువురు ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఛార్జీలకన్న అదనంగా డబ్బులు వెచించి ప్రయాణాలు చేయాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-పొదిలి

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కేసరి శ్రీనివాస రెడ్డి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని చింతగుంపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కేసరి శ్రీనివాస్ రెడ్డి సన్మాన సభ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంఇఓ శ్రీనివాసరెడ్డి, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకుడు పిల్లి రమ ణారెడ్డి, పొదిలి, కెకెమిట్ల, మర్రిపూడి ఎంఇఓలు పి నాగలక్ష్మి, డాంగేషరీఫ్, నరసింహారావు, యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ మాధవరెడ్డి, డాక్టర్ రామప్రతాప్ రెడ్డి, లక్ష్మిదేవి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి బాలవెంక టేశ్వర్లు, వెంకట లక్ష్మమ్మ, ప్రతాప్ రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎ బాదుల్లా, నరసింహం, అబ్దుల్‌హై, ఎస్‌వి. కొండారెడ్డి పాల్గొన్నారు.

'గుండ్లకమ్మ'లో చేపల చెరువులు..

వైసిపి, టిడిపి నేతల ఉమ్మడి సహకారంతో చేపల సాగు


చేపల చెరువు..

ప్రజాశక్తి-మద్దిపాడు


అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపికి చెందిన నాయకుల దోస్తీతో ప్రభుత్వ ఆదాయానికి భారీ ఎత్తున గండి పడుతోంది. ఏకంగా గుండ్లకమ్మలోనే చెరువులు తవ్వి వాటిలో చేపలు సాగు చేస్తున్నారు. గుండ్లకమ్మ ఎగువ భాగాన ఇంత పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నా అధికారులకు మాత్రం నిద్ర మత్తు వదలడం లేదు..

బూరేపల్లి కొండ సమీపంలో కొందరు భూములను దున్ని చెరువులు ఏర్పాటు చేస్తున్నారు. అందులో చేపలు పెంచుతూ అక్రమార్జన సాగిస్తున్నారు. అసలుకే గుండ్లకమ్మలో నీరు డెడ్ స్టోరేజీలో ఉంది. వేసవిలో తాగునీరుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉండగా ఆ నీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. దీంతో డ్యామ్‌లో నీరు శాతం తగ్గిపోతోంది. ఇదంతా ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడి సపోర్టుతో జరుగుతుండగా వీరికి అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు సహకారం పుష్కలంగా ఉంది. వీరి దోస్తీతో అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు..

'కలాం సైంటిఫిక్' టెస్ట్‌కి విశేష స్పందన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక ఆంధ్ర హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ-అభ్యాస్ కలాం సెంట్రిఫ్రిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ విశేష స్పందన లభించింది. హైదరాబాద్ ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో 3 నుండి 10వ తరగతి విద్యార్థులకు ఈ టెస్ట్ నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్ష మెదట స్థాయికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 175 స్కూల్స్ నుంచి 35,000 మంది విద్యార్థులకు నిర్వహించి అత్యంత ప్రతిభ కనపరిచిన 8,000 మంది విద్యార్థులుకు 2 స్థాయి పరీక్ష 09 కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో అత్యంత ప్రతిభకనపరిచి 1, 2 ,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏప్రిల్ 7న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే అవార్డు ఫంక్షన్ 10 వ అభ్యసోత్సవ్‌లో బహుమతి ప్రదానం జరుగుతుందని సంస్థ సిఇఒ డాక్టర్ ఫణి పవన్ తెలియజేశారు. ఆంధ్రహైస్కూల్ సెంటర్‌లో 22 పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రతిభా పరీక్షలు విద్యార్థులతో పోటీతత్వాన్ని పెంచి, ధైర్యాన్ని ఇచ్చి రానున్న కాలానికి సిద్ధం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఈ- అభ్యాస్ అకాడమీ ఆంధ్ర మేనేజర్ బి.సాయిరామ్ గారు, హెచ్ఎం యుగేష్, ఆక్స్‌ఫర్డ్ ఆక్స్ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ లక్ష్మి, నారాయణ స్కూల్ నుంచి నారాయణ, శ్రీ రామ్ బలింపియాడ్ స్కూల్ డైరెక్టర్ శ్రీరాములు రెడ్డి, కమల స్కూల్ నుండి పవన్, జూపిటర్ స్కూల్ నుంచి వంశీ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం

ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోను..

చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం

ప్రజాశక్తి-అద్దంకి

రాజకీయ ప్రచారంలో స్థాయిని మరిచి.. స్థాయిని తగ్గించుకొని మాట్లాడితే ఊరుకునేది లేదని, ఇంకొల్లు సభలో చంద్రబాబు ఒళ్లు బలిసి మాట్లాడారని చీరాల శాసనసభ్యులు కరణం బలరామకష్ణమూర్తి ఘాటైన విమర్శలు చేశారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన నాగులపాడు సొసైటీ అధ్యక్షునిగా మానికొండ నాగరాజు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించలేదని, అలాగని తనను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాగులపాడు సొసైటీ గతంలో అవకతవకలతో గతితప్పి సాగిందని, హనిమిరెడ్డి వచ్చిన తర్వాత అది గాడిలో పడినట్లు అనిపిస్తోందన్నారు. సొసైటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని డిసిసిబి చైర్మన్ ప్రసాద్‌రెడ్డికి సూచించారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని అందరం ఐక్యంగా ఉండి పార్టీని గెలిపించుకోవాలని అద్దంకి వైసీపీ ఇంచార్జ్ హనిమిరెడ్డి అన్నారు. కార్యక్రమానికి ముందు నాగులపాడు సొసైటీ అధ్యక్షులుగా మానికొండ నాగరాజు, పాలకవర్గ సభ్యులుగా భీమనాదం రాఘవరెడ్డి, వెంగళశెట్టి వెంకటేశ్వర్లుతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీవీ కష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకష్ణమూర్తి, మున్సిపల్ వై చైర్మన్లు పద్మేష్, వీరయ్య అనంతలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బివి సుబ్బయ్య స్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట బీవీ.సుబ్బయ్య స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఒంగోలులోని అతిథి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. సుబ్బయ్య స్కూల్లో 1991- 93 విద్యా సంవత్సరాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన విద్యార్థులు సమావేశమయ్యారు. తమ అభివద్ధికి బాటలు వేసిన బీవీ సుబ్బయ్య మాస్టారు గురించి స్మృతులను నెమరువేసుకున్నారు. ఆయన నిర్వహించిన క్రమశిక్షణ నియమ నిబంధనల వల్ల తామంతా వివిధ రంగాల్లో ఉన్నత స్థితిలో స్థిరపడ్డామని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన అప్పటి ఉపాధ్యాయ మరియు అధ్యాపకులైన కేవీ శేషయ్య, నల్లూరి కష్ణారావు, విఎస్ఆర్ ఆరికట్ల రమణయ్య, మోహనరావు సుబ్బయ్య స్కూల్ ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం తమతో పాటు విద్యనభ్యసించి ఆర్మీలో చేరి రిటైర్ అయిన ముగ్గురు మిత్రులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన ఆరికట్ల శ్రీనివాసరావు, మిరియాల హరిబాబు, వాడా మనోహర్, గొల్లపూడి సుబ్బారావు, బోడెపుడి కష్ణమూర్తి, ఈదర విష్ణుమోహన్, పుచ్చకాయల గంగాధర్ పాల్గొన్నారు.


వైసిపిలోకి ఆహ్వానిస్తున్న దద్దాల

వైసీపీలో చేరిక

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మండలం శ్రీరంగాపురంలో ఆదివారం రాత్రి పలు కుటుంబాలు టిడిపి నుంచి వైసీపీలో చేరాయి. వైసిపి ఇన్చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నవరత్నాల పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి సీఎం జగన్మోహన్ రెడ్డి తనే సాధ్యమని వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిని వైసిపి ఇన్‌ఛార్జి దద్దాల అభినందించారు. కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డి, కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, కనిగిరి నియోజకవర్గ నాయకులు సుజాతరెడ్డి పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

- బిందు సేద్యం లక్ష్యాల సాధనకు చర్యలు
- 100 శాతం లక్ష్యాల సాధిస్తున్నాం
- 16 మండలాలపై ప్రత్యేక శ్రద్ధ
- ఎపిఎంఐపి పీడీ పివి రమణ వెల్లడి



ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో రైతాంగ అభ్యున్నతికి కృషి చేస్తున్నామని, వ్యవసాయ భూములకు సాగునీటి వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్ట్స్(ఎపిఎంఐపి) పథక సంచాలకులు పివి రమణ తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా బిందు సేద్యం అమలుకు కృషి చేస్తున్నామన్నారు. 16 మండలాల్లో నీటి నిల్వల లభ్యత తక్కువగా ఉండటంతో వాటిపై దృష్టి సారించామన్నారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, రాయితీల వివరాలను పథక సంచాలకులు ప్రజాశక్తికి వివరించారు.

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకాన్ని జిల్లాలో 2002 నుంచి అమలు చేస్తున్నాం. ఎపిఎంఐపి జిల్లా చైర్మన్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో సాగునీటి వనరుల పెంపుదలకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళుతున్నాం. 2002 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు 88,349 హెక్టార్లు సాగులోకి వచ్చాయి. 1,19,858 హెక్టార్ల అనువైన వ్యవసాయ భూములు అందుబాటులో ఉన్నాయి 2023-24 ఆర్థిక సంవత్సరానికి 10,000 హెక్టార్లు బిందు సేద్యం లక్ష్యం కాగా 9543.31 హెక్టార్లు సాగైంది. దీంతో 95.43 సాగు శాతం నమోదైంది. ఇందుకు మొత్తం 105.24 కోట్లు ఖర్చు కాగా రైతుల వాటా 15.34 కోట్లు, సబ్సిడీ 84.89 కోట్లు రైతులకు అందించాం. 9536,7 హెక్టార్లకు 8,444 మంది రైతులకు పరికరాలు అందజేశాం. పథకంలో ఒకసారి రాయితీ పొందిన రైతు మళ్ళీ 7 సంవత్సరాల వరకు సబ్సిడీ పొందటానికి అవకాశం లేదు. రైతులకు యూనిట్లు మంజూరులో రాష్ట్రంలో ప్రకాశం జిల్లా రెండో స్థానంలో ఉంది.

పథకంలో 20 కంపెనీల భాగస్వామ్యం

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం అమలులో 20 కంపెనీలు భాగస్వాములయ్యారు. వీరు ప్లెయిన్ లాటరల్స్, ఎమిట్టింగ్ పైప్, హెచ్‌పిడిఇ పైప్, డిప్పర్స్, పివిసి పైప్స్, పిపిసి బాల్ వాల్వ్ వంటివి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్) ప్రమాణాలకు అనుగుణంగా రైతులకు సరఫరా చేయాల్సి ఉంది. ఆయా కంపెనీలు సరఫరా చేసిన పరికరాలపై జిల్లాల్లో ర్యాండమ్‌గా శాంపిల్స్ తీసుకుంటాం. కొన్ని కంపెనీలు క్యూఆర్ కోడ్ కూడా నమోదుచేయటంతో అక్రమాలకు ఆస్కారం లేకుండా పోతోంది. ప్రాథమిక, తుది దశలలో రైతులు ఏర్పాటు చేసే పరికరాలపై మూడు చోట్ల ఫొటోలు తీసి ఫార్మర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ఆయా కంపెనీలు రైతులకు 3 సంవత్సరాల వరకు సర్వీస్‌ను ఉచితంగా చేస్తారు. స్పేర్ పార్ట్ చెడిపోతే రైతు కొనుగోలు చేయాల్సి ఉంది. 5 ఎకరాల లోపు రైతులకు 90 శాతం సబ్సిడీ, 5 ఎకరాలు దాటిన రైతులకు 70 శాతం సబ్సిడీ ఇస్తున్నాం.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రైతులు బిందు సేద్యంలో ఏమైనా సమస్యలు ఉంటే వారిని 2 పద్ధతులలో పరిష్కరిస్తున్నాం. హెచ్ఆర్ రిక్వెస్ట్ ట్రాకింగ్ సిస్టమ్, కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1800-4252960కి రైతులు సమస్యలను తెలియజేయవచ్చు. ప్రధానంగా రైతులకు సరఫరా చేసిన లాటరల్స్ చెడిపోవటం, సర్వేకి రాకపోవటం, మెటీరియల్ ఆలస్యం కావటం, పైపుల లీకేజీ వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. రిక్వెస్ట్ ట్రాకింగ్ సిస్టమ్‌లో నమోదైన ఫిర్యాదులు ప్రతి నెల 1 నుంచి 13 లోపు పథక సంచాలకులకు పంపుతున్నారు. 3 రోజులలో తాను సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ సమాధానం రైతులకు నచ్చకపోతే కాల్ సెంటర్‌కి ఫోన్ చేయవచ్చు. 2023 డిసెంబర్ వరకు 210 ఫిర్యాదులు వస్తే వాటన్నింటిని పరిష్కరించాం.

ప్రతి వారం 14 చోట్ల శిక్షణ

జిల్లాలో ప్రతి బుధ, గురువారాలలో రైతులకు శిక్షణా కార్యక్రమాలు ఇస్తున్నాం. ప్రతి వారం 14 చోట్ల ఇవి జరుగుతున్నాయి. ఇందులో రైతులు, ఎపిఎంఐపి ఎంఐ ఇంజినీర్, మార్కాపురంలోని ఎంఐడిసి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. డ్రిప్, స్ప్రింక్లర్ల మెయింటెన్స్, వాటి ఉపయోగాలు, ఎరువులు వినియోగించే విధానంపై అవగాహన కల్పించటం జరుగుతోంది. ఇటీవల కేంద్ర బృందం త్రిపురాంతకం, దేవరాజు గట్టు ప్రాంతాలలో పర్యటనకు వచ్చిన సందర్భంలో రైతులు సబ్సిడీ పొందితే తరువాత మళ్ళీ 7 సంవత్సరాల వరకు రాదని, దీనిని 5 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

16 మండలాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో 16 మండలాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. యర్రగొండపాలెం, కొనకనమిట్ల, పెద్దారవీడు, తర్లుపాడు, దొనకొండ, దర్శి, త్రిపురాంతకం, మార్కాపురం, పొదిలి, కనిగిరి, దోర్నాల, పుల్లలచెరువు, బేస్తవారపేట, వెలిగండ్ల, కంభం హెచ్ఎంపాడు మండలాలు ఉన్నాయి. ఇందుకు వర్షాలు కురియకపోవటం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర భూగర్భ జల శాఖల అధికారులు వీటిపై దృష్టి సారించాలని సూచించారు.